సాక్షి
పెద్దపల్లి

బుధవారం । 19 । జులై । 2023



రెస్క్యూ పోటీలకు సన్నద్ధం

బొగ్గు గనుల్లో ప్రమాదం జరిగిన సమయంలో తామున్నామంటూ భరోసానిచ్చే సింగరేణి రెస్క్యూకు జాతీయ స్థాయిలో ప్రత్యేక పేరుంది. 8లో▸



కలెక్టర్‌ను కలిసిన టీజీవోలు

పెద్దపల్లిరూరల్: కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌ను టీజీవో సంఘం అధ్యక్షుడు రవీందర్, అసోసియేట్ ప్రెసిడెంట్ వేణుగోపాల్‌రావు, కాంతాల అలివేణి, కవిత, రమేశ్, శ్రీనివాస్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు.

గరిష్ఠం/కనిష్ఠం
26.0/24.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలోని చాలా ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

ఓటరు జాబితాలో పొరపాట్లు ఉండొద్దు



మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

పెద్దపల్లిరూరల్: ఓటరు జాబితాలో పొరపాట్లు లేకుండా మరోసారి ధృవీకరించిన తర్వాతే జాబితా రూపొందించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో బూత్‌స్థాయి అధికారులతో సమావేశమయ్యారు. ఈనెల 23వరకు పెండింగ్‌లో ఉన్న ఓటరు దరఖాస్తులను పరిష్కరించాలన్నారు. ప్రతి దరఖాస్తును పరిశీలించాలన్నారు. ఒకే ఇంటి నంబరుతో ఆరు కన్న ఎక్కువ ఓటర్ల వివరాలను ధృవీకరించుకోవాలన్నారు. ఓటర్ల పేర్లను తొలగిస్తే కారణాలు తెలపాలన్నారు. ఆర్డీవో కె.వీరబ్రహ్మచారి, ఎన్నికల డీటీ ప్రవీణ్, బూత్ స్థాయి అధికారులు ఉన్నారు. అంతకుముందు అన్ని విభాగాల అధికారులతో సమావేశమయ్యారు. ఒక్కో అధికారిని పరిచయం చేసుకున్నారు.

నేడు సుల్తానాబాద్‌కు ఆర్‌ఎస్.ప్రవీణ్ కుమార్

సుల్తానాబాద్: సుల్తానాబాద్ మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించే సమావేశానికి బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ బుధవారం వస్తున్నట్లు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష, కోశాధికారి రియాజ్ తెలిపారు. పట్టణంలోని శాస్త్రీనగర్ వద్ద ఆయనకు స్వాగతం పలకనున్నట్లు తెలిపారు. అభిమానులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

ఓసీపీల్లో నిలిచిన ఉత్పత్తి



ఓసీపీ-3లో నిలిచిపోయిన డంపర్లు

గోదావరిఖని: జిల్లాలో కురుస్తున్న వర్షానికి ఓసీపీల్లో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. ఓబీ (ఓవర్‌బర్డెన్) పనులు స్తంభించాయి. రామగుండం రీజియన్‌లో మంగళవారం 3.80లక్షల క్యూబిక్‌మీటర్ల ఓబీ, 45వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి అంతరాయం కలిగింది, స్టాక్‌యార్డులో నిల్వ ఉన్న బొగ్గును వినియోగదారులకు అందిస్తున్నారు. ఆర్జీ-1 పరిధి జీడీకే-5 ఓసీపీలో 90క్యూబిక్ మీటర్ల ఓబీ, 9వేల టన్నుల బొగ్గు, ఆర్జీ-2 ఏరియా ఓసీపీ-3లో 1.70లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీ, 24వేల టన్నుల బొగ్గు, ఆర్జీ-3 పరిధి ఓసీపీ-1, 2లో 1.20 లక్షల క్యూబిక్‌మీటర్ల ఓబీ, 12వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది.

మేడారం లింక్ కెనాల్‌కు రూ.5.15కోట్లు విడుదల



నిర్మాణం చేస్తున్న మేడారం లింక్ కాలువ

ధర్మారం: మండలంలోని నందిమేడారం రిజర్వాయర్ నుంచి ధర్మారం శివారు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు డి-83బి కాలువ వరకు నిర్మిస్తున్న లింక్ కెనాల్‌కు నీటిపారుదల శాఖ నుంచి అదనంగా రూ.5.15 కోట్లు మంజూరైనట్లు మంత్రి కొప్పుల ఈశ్వర్ తెలిపారు. డీ-83బి కెనాల్ చివరి ఆయకట్టుకు సాగునీరందక రైతులు ఇబ్బంది పడుతున్నందున నంది మేడారం రిజర్వాయర్ నుంచి లింక్ కాలువ ద్వార నీటిని అందించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా.. నిధులు మంజూరీ చేసిందన్నారు. మొదటి విడత రూ.6.99 కోట్లు విడుదలకాగా పనులు ప్రారంభించామని, తాజాగా మరో రూ.5.15 కోట్లు అదనంగా మంజూరు చేసిందని పేర్కొన్నారు.

స్వీపర్ల సమస్యలు పరిష్కరించండి

పెద్దపల్లిరూరల్: పాఠశాలల్లో పనిచేస్తున్న స్వీపర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి జ్యోతి డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రంలోని అమర వీరుల స్తూపం వద్ద మంగళవారం నిరసన చేపట్టారు. స్వీపర్లకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో స్వీపర్ల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మయ్య, రాయలింగు, నాయకులు చిన్న రాజయ్య, స్వామి, లక్ష్మి, బిస్మిల్లా, లింగయ్య, వెంకటి, చంద్రయ్య, రమేష్ అనసూయ ఉన్నారు.



పట్టు సాధిస్తా.. మార్క్ చూపిస్తా..

సాక్షి ఇంటర్వ్యూ

- విద్యకు తొలి ప్రాధాన్యం
- అన్ని శాఖల అధికారులతో మాట్లాడుతున్నా..
- జిల్లాను అభివృద్ధిలో ముందు వరుసలో నిలుపుతా
- 'సాక్షి'తో జిల్లా నూతన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



'పరిపాలన అంటే పథకాలు అమలు చేయడం.. సంక్షేమ ఫలాలు ప్రజలకు అందించడం.. క్షేత్రస్థాయిలో ఫలితాలు రాబట్టడం. ఇదే వందశాతం జిల్లా ప్రజలకు అందేలా జిల్లాలోని అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో ముందుకు వెళ్తా. జిల్లా ఇప్పటికే అనేక రంగాల్లో ముందుంది. అదే స్ఫూర్తితో విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టిసారిస్తా. జిల్లాలో కీలకమైన సమస్యలపై అవగాహన పెంచుకుని దశలవారీగా పరిష్కరిస్తా. పాలనలో కలెక్టర్‌గా నా ముద్ర ఉండేలా చూస్తా..' అన్నారు నూతన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్. జిల్లాలోని పలు అంశాలపై తన లక్ష్యాలను సూటిగా వెల్లడించారు. ప్రతివారం నిర్వహించే ప్రజావాణి సహా.. జిల్లాలోని ప్రతి ఫిర్యాదు, ప్రతి ప్రభుత్వ కార్యక్రమం అమలుపై శ్రద్ధ పెడతానన్నారు. మంత్రులు, ప్రజాప్రతినిధులు, ప్రజల సహకారంతో మెరుగైన పాలన అందిస్తానని చెప్పారు. 'సాక్షి'తో మరిన్ని విషయాలు పంచుకున్నారు. – సాక్షి, పెద్దపల్లి

> కలెక్టర్‌గా నాకు ఇదే తొలి పోస్టింగ్. సిద్దిపేటలో అదనపు కలెక్టర్‌గా పనిచేశాను. తాత, నాన్న సివిల్ సర్వెంట్స్. అందుకే చిన్నప్పటి నుంచి అన్ని అంశాలపైనా అవగాహన ఉంది. ఆ అవగాహనతోనే ప్రజలకు సుపరిపాలన అందిస్తా. సొంత రాష్ట్రంలో కలెక్టర్‌గా పనిచేయటం చాలా సంతోషంగా ఉంది. మన వాళ్ల దగ్గర ఉండి పనిచేయడం.. అది ప్రజలకు దగ్గరగా ఉండి సేవచేయటం అదృష్టం. మూడో ప్రయత్నంలో ఐఏఎస్ సాధించి సిద్దిపేటలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా మూడేళ్ల తొమ్మిది నెలలు పనిచేశా. అక్కడి పాలన అనుభవంతో జిల్లాలో కార్యక్రమాలు ముందుకు తీసుకెళ్తా. స్వచ్ఛభారత్‌లో పెద్దపల్లి సైతం అవార్డులు సాధించింది. గత అధికారులు, ప్రజాప్రతినిధుల కృషితోనే ఇది సాధ్యమైంది. అదే స్ఫూర్తితో సరైన డైరెక్షన్‌తో అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపేలా కృషిచేస్తా.

విద్యకు తొలి ప్రాధాన్యం

విద్యాశాఖపై ప్రత్యేకంగా సమీక్షించి పాఠశాలల్లో బోధన సజావుగా సాగేలా చర్యలు చేపడుతాం. మన ఊరు – మన బడి, తొలిమెట్టు తదితర ప్రభుత్వ కార్యక్రమాలు సజావుగా అమలు చేసి ప్రైవేట్‌లో చదివే విద్యార్థులకు లభించే అన్ని అవకాశాలూ ప్రభుత్వ విద్యార్థులకు దక్కేలా చేయటం ముఖ్యం. సిద్దిపేటలో ఫేస్ (ప్రొఫెషనల్ అడ్వాన్స్ అండ్ కంటిన్యూ ఎడ్యుకేషన్) కార్యక్రమం ద్వారా వేసవి సెలవుల్లో రెండు నెలల పాటు టీచర్లకు ట్రెనింగ్ ఇప్పించాం. ఆ కార్యక్రమాన్ని జిల్లాలో అమలు చేసి టెన్త్‌లో మంచి ఫలితాలు సాధించేలా కృషిచేస్తా.

భూసమస్యల పరిష్కారానికి..

భూదస్త్రాల ప్రక్షాళనలో మిగిలినవి, దీర్ఘకాలికంగా ఉన్న సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారిస్తా. ధరణి పోర్టల్‌లోని సమస్యలపై గ్రీవెన్స్‌లో వచ్చిన సమస్యలు పెండింగ్‌లో లేకుండా పరిష్కరించాలని నిర్ణయించాను. పీడీఎస్ బియ్యం పక్కదారి పట్టకుండా చర్యలు తీసుకుంటాం. ఎవరైనా అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం.

సిజేరియన్లు తగ్గిస్తాం

ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో సిజేరియన్లు తగ్గించేందుకు సిద్దిపేటలో మంత్రితో కలిసి అనేక కార్యక్రమాలు చేపట్టాం. జిల్లాలో సైతం వైద్యులతో సమావేశమై ప్రజలకు సిజేరియన్లు తగ్గించేలా అవగాహన కార్యక్రమాలు చేపడుతాం.

ప్రజాప్రతినిధులతో కలిసి..

ప్రజాప్రతినిధులు, అధికారుల దృక్పథం ఒక్కటేనని నా అభిప్రాయం. ఇరువురు దృష్టి పెట్టేది అభివృద్ధిపైనే. ఆ ప్రయత్నంలో నా వంతుగా ఇటు ప్రజలతోనూ, అటు ప్రజాప్రతినిధులతో కలిసి పనిచేస్తా. ఈ విషయంలో అధికారులతో సమన్వయంగా వ్యవహరిస్తా. అందరూ కలిసికట్టుగా పనిచేసి జిల్లాను ప్రగతి పథంలో నడిపించాలన్నదే నా అభిమతం.

జవాబుదారీతనంగా పనిచేయాలి

నేను బాధ్యతలు చేపట్టగానే జిల్లాస్థాయి ఉన్నతాధికారులందరితో మాట్లాడుతున్నా. ప్రస్తుతం జిల్లాలో వివిధ పథకాల అమలు, అభివృద్ధి పనుల ప్రగతి తదితర అంశాలపై వారిని అడిగి తెలుసుకున్నా. ప్రభుత్వ ఉద్యోగులు జవాబుదారీతనంగా పనిచేయాలని సూచించా. రానున్న రోజుల్లో జిల్లాపై మరింత పట్టు సాధించి నా మార్క్‌ను అభివృద్ధిపరంగా చూపిస్తా.

రన్నింగ్ చేస్తా.. గిటార్ ప్లే చేస్తా

నేను హైదరాబాద్‌లో పుట్టి పెరిగాను. నాన్న ఏకే.ఖాన్. ఆయన ఐపీఎస్ కావటంతో స్కూల్ చదువు పూర్తయ్యేలోపు 12 పాఠశాలలు మారాల్సి వచ్చింది. బిట్స్ పిలానీలో గ్రాడ్యుయేషన్ పూర్తయ్యింది. తాత కూడా ఐఏఎస్ కావడంతో చిన్నప్పటి నుంచి సివిల్స్ వైపు వెళ్లాలనిపించింది. నా భార్య హమీనా ఐఎఫ్ఎస్, ఢిల్లీ కేంద్రంగా ఫారెన్ సర్వీస్‌లో యూఎన్‌వోలో పనిచేస్తోంది. ఆమె మలయాళీ. మా ఇద్దరికీ ట్రెనింగ్‌లో పరిచయం ఏర్పడింది. పెద్దల సమక్షంలో వివాహం చేసుకున్నాం. ప్రజలతో మమేకం కావటం, వారి సమస్యలు పరిష్కరించమంటే మరింతగా ఆస్వాదిస్తాను. రన్నింగ్ చేయటం, గిటార్ ప్లే చేయటం, పుస్తకాలు చదవటం అంటే ఇష్టం. కొత్తగా సివిల్స్ ప్రిపేర్ అయ్యేవారికి నేను ఒక్కటే చెబుతా.. ఎందుకోసం చదువుతున్నాం..? ఏం చదువుతున్నాం..? అనేది ముందుగా తెలుసుకుంటే ప్రిపరేషన్ సులువవుతుంది.

దేశానికే ఆదర్శంగా కేసీఆర్ పాలన

- రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్



కండువా కప్పుతున్న కోరుకంటి చందర్

గోదావరిఖని: దేశానికే ఆదర్శంగా కేసీఆర్ పాలన కొనసాగుతోందని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో 40మంది బీఆర్‌ఎస్‌లో చేరగా కండువాలు కప్పి ఆహ్వానించారు. సీఎం కేసీఆర్ సంక్షేమ పాలనకు ప్రజల ముఖంలో ఆనందం కనిపిస్తోందన్నారు. ఆటోవాలాలకు అండగా ఉంటామన్నారు. నాయకులు మెతుకు దేవరాజ్, చిట్టవేన వేణు, జహీద్ పాషా, తోకల రమేశ్ ఉన్నారు.

వ్యతిరేకులను పార్టీ నుంచి బహిష్కరించాలి

పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్న వారిని పార్టీ నుంచి బహిష్కరించాలని దళితబంధు లబ్ధిదారులు కోరారు. స్థానిక తిలక్‌నగర్‌లోని ఓ ఫంక్షన్‌హాల్లో దళితబంధు లబ్ధిదారులు సమావేశమయ్యారు. ఎమ్మెల్యే చందర్, బీఆర్‌ఎస్‌ను చులకచేసి మాట్లాడుతున్న వారిని సహించొద్దన్నారు. సీరటి శ్రీనివాస్, ఇరుగురాళ్ల శ్రావణ్, బాసంపెల్లి శ్రీనివాస్, కొలుగూరి సాయికుమార్ తదితరులు ఉన్నారు.

చందర్ హఠావో.. బీఆర్‌ఎస్ బచావో..

- ఎమ్మెల్యే ఆశావహ అభ్యర్థుల వెల్లడి



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

పాలకుర్తి: ఎమ్మెల్యే చందర్‌పై వ్యతిరేకత పెరిగిందని, నియోజకవర్గాన్ని అవినీతిమయంగా మార్చారని పాలకుర్తి జెడ్పీటీసీ కందుల సంధ్యారాణి, టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి, కేశోరాం గుర్తింపు కార్మిక సంఘం అధ్యక్షుడు బయ్యపు మనోహర్‌రెడ్డి, మాజీ మేయర్ కొంకటి లక్ష్మీనారాయణ, కార్పొరేటర్ పాతిపెల్లి ఎల్లయ్య అన్నారు. బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కర్మాగారంలో మంగళవారం ప్రజా ఆశీర్వాదయాత్ర చేపట్టారు. రామగుండంలో చందర్ హఠావో.. బీఆర్‌ఎస్ బచావో నినాదంతో తామంతా ముందుకెళ్తామని పేర్కొన్నారు. కేశోరాంలో ప్రతి మూడు నెలలకోసారి సమావేశం ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కరిస్తామని, విరమణ వయసు 61 ఏళ్లకు పెంచుతామని ఎమ్మెల్యే హామీ ఇచ్చి మూడేళ్లయినా పురోగతి లేదని తెలిపారు. చందర్‌పై ఉన్న వ్యతిరేకత ఎన్నికల్లో ప్రభావం చూపుతుందని, అధిష్టానం ఈ విషయంలో స్పందించి అభ్యర్థిని మార్చాలని కోరారు. తాము బీఆర్‌ఎస్ పార్టీకి వ్యతిరేకం కాదన్నారు. కేశోరాం పర్మినెంట్ కార్మికసంఘం ప్రధాన కార్యదర్శి దాడి మహేశ్, అంజి, నరేష్, స్వరూప, వెంకటేష్, తిరుపతి, కుమార్ ఉన్నారు.

మూడు పంటలా.. మూడుగంటల కరెంటా..?

- రైతులే తేల్చుకోవాలి
- పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి



కాల్వశ్రీరాంపూర్ రైతువేదికలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దాసరి

కాల్వశ్రీరాంపూర్: బీఆర్‌ఎస్ అధికారంలోకొచ్చాక వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి తెలిపారు. నిరంతర విద్యుత్‌తో ఏటా మూడు పంటలను రైతులు పండించుకుంటున్నారని, కాంగ్రెస్ మాత్రం తాము అధికారంలోకొస్తే మూడు గంటలే కరెంట్ ఇస్తామంటోందని, దీనిపై రైతులే తేల్చుకోవాలని కోరారు. మేలుకో రైతన్న కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని పెగడపల్లి రైతు వేదికలో ఎమ్మెల్యే మాట్లాడారు. తెలంగాణ రాకముందు ఒక్క పంటకే దిక్కులేదని, నేడు రెండు పంటలూ పండిస్తూ రాష్ట్రం అన్నపూర్ణగా ఖ్యాతి దక్కించుకుందన్నారు. జెడ్పీటీసీ వంగళ తిరుపతి రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ చదువు రాంచంద్రారెడ్డి, రైతు సమితి మండల కన్వీనర్ దేవయ్య, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాజకొమురయ్య, నారాయణ రెడ్డి, ఈర్ల శ్రీనివాస్, సర్పంచులు, ఎంపీటీసీలు, రైతులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక

వెన్నంపల్లికి చెందిన కాంగ్రెస్ నాయకులు మంగళవారం బీఆర్‌ఎస్ చేరారు. వారికి ఎమ్మెల్యే దాసరి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఎంబాడి తిరుపతి, బండి సదానందం, పనాస రాజేందర్, కారుకూరి రాజేశం, తిలక్, శ్రీనివాస్, లచ్చయ్య, మొండయ్య, రవీందర్, రాజయ్య, వెంకటేష్, సమ్మయ్య, సతీష్, కిరణ్, బాలమల్లు, నరేశ్ ఉన్నారు.

24గంటల కరెంట్ ఘనత బీఆర్‌ఎస్‌దే

సుల్తానాబాద్ రూరల్: రైతులకు 24 గంటల నాణ్యమైన కరెంట్‌ను ఇచ్చిన ఘనత బీఆర్‌ఎస్‌కే దక్కుతుందని ఎమ్మెల్యే అన్నారు. సుల్తానాబాద్ మండలం సుద్దాల రైతు వేదికలో రైతన్న మేలుకో కార్యక్రమాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ పాలనలో పవర్‌హాలిడే, క్రాఫ్‌హాలిడే ఉండేవని, ఇప్పుడు మూడు పంటలూ పండించుకుంటున్నారని పేర్కొన్నారు. రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు అనంత రెడ్డి, ఎంపీపీ బాలాజీరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ సునిత, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులను తరిమికొట్టాలి

ఓదెల: మాయమాటలతో గ్రామాల్లోకి వచ్చే కాంగ్రెస్ నాయకులను తరిమికొట్టాలని ఎమ్మెల్యే రైతులకు సూచించారు. కాంగ్రెస్ పార్టీ రైతులకు చేసింది ఏమీ లేదని గుర్తుచేశారు. రైతుబంధు, రైతుబీమా అందిస్తున్న ఘనత కేసీఆర్‌దేనన్నారు. ఎంపీపీ కునారపు రేణుకదేవి, ఐరెడ్డి వెంకటరెడ్డి, కావటి రాజు, ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి, బండారి ఐలయ్యయాదవ్, సర్పంచులు పాల్గొన్నారు.

జేఎన్టీయూలో సీట్ల భర్తీకి కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్

కమాన్‌పూర్: మంథని జేఎన్‌టీయూలో సింగరేణి ఉద్యోగులు, కార్మికుల పిల్లలకు కేటాయించిన 5శాతం సీట్ల భర్తీకి మంగళవారం ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో కౌన్సిలింగ్ నిర్వహించారు. ప్రతి విభాగంలో 5శాతం చొప్పున సీట్లు కేటాయించారు. మొత్తం 32సీట్లకు కార్మికుల పిల్లలు 25, అధికారుల పిల్లలు 8 మంది హాజరయ్యారు. ఆరుగురు కార్మికుల పిల్లలు, ఐదుగురు అధికారుల పిల్లలు సీట్లు పొందారు. వర్సిటీ డిప్యూటీ డైరెక్టర్(అడ్మిషన్స్) రాంజీ, అసిస్టెంట్ రిజిస్ట్రార్ వెంకట్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.





జిల్లాకు ఆరెంజ్ అలర్ట్..

సుల్తానాబాద్: కొన్ని రోజులుగా ఊరించిన మేఘం వర్షిస్తోంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో సోమవారం అర్ధరాత్రి నుంచి ఏకధాటిగా వర్షం కురుస్తూనే ఉంది. జిల్లాలో సగటున 12.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అన్నదాతలు సాగుకు సన్నద్ధమవుతుండగా.. వాతావరణ శాఖ జిల్లాకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. వచ్చే నాలుగు రోజులపాటు భారీ వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. చెరువులు, వాగులు, మానేరు పరిసరాలకు వెళ్లవద్దని మత్స్యకారులు, రైతులను ఉన్నతాధికారులు కోరుతున్నారు. ఇప్పటికే బోరుబావుల్లో నీటి లభ్యత ఉన్న రైతులు నాట్లు వేయగా.. తాజాగా ముసురు వానలకు అన్నదాతలను పొలాలను సిద్ధం చేసే పనిలో పడ్డారు.

క్లుప్తంగా

జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటు చేయాలి



హైకోర్టు రిజిస్ట్రార్ సృజనకు వినతిపత్రం ఇస్తున్న న్యాయవాది శంకర్

ఓదెల: మండల కేంద్రంలో జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటు చేయాలని ఓదెల గ్రామానికి చెందిన హైకోర్టు న్యాయవాది పొలాస శంకర్ కోరారు. ఈ మేరకు హైకోర్టు రిజిస్ట్రార్ సృజనకు మంగళవారం ఆయన వినతిపత్రం అందించారు. సుల్తానాబాద్‌లో కోర్టు ఉన్నా కేసుల సంఖ్య పెరిగి పోతుండటంతో పరిష్కారంలో జాప్యం జరుగుతోందన్నారు. ఓదెలలో కోర్టు ఏర్పాటు చేస్తే ఓదెల, కాల్వశ్రీరాంపూర్ మండలాల ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని తెలిపారు. స్పందించిన రిజిస్ట్రార్ కోర్టు ఏర్పాటుకు సుముఖత వ్యక్తం చేసినట్లు శంకర్ పేర్కొన్నారు.

జాతీయ టగ్‌ఆఫ్‌వార్ పోటీలకు ఎంపిక



విద్యార్థినులను అభినందిస్తున్న నరేందర్ రెడ్డి

సుల్తానాబాద్: తమిళనాడు రాష్ట్రంలోని నమ్మకల్ జిల్లా తిరుచున్ గోడు పట్టణంలో ఈ నెల 20 నుంచి 24 వరకు జరగనున్న జాతీయ స్థాయి టగ్‌ఆఫ్‌వార్ పోటీలకు ఆల్ఫోర్స్ విద్యార్థులు ఎంపికయ్యారని ఆ విద్యాసంస్థల అధినేత వి.నరేందర్ రెడ్డి తెలిపారు. మంగళవారం సుల్తానాబాద్ ఆల్ఫోర్స్ హైస్కూల్లో వారిని అభినందించారు. ఆయన మాట్లాడుతూ.. కేవలం చదువులకే పరిమితం కాకుండా విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దుతున్నామని అన్నారు. నిష్ణాతులైన శిక్షకులచే క్రీడల్లో శిక్షణ ఇప్పిస్తుండటంతో పిల్లలు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో రాణిస్తున్నారని చెప్పారు. హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి టగ్‌ఆఫ్‌వార్ ఎంపిక పోటీల్లో జె.రుక్మిణి, బి.సిరి, ఎస్.నికిత, పి.సహస్రలు ప్రతిభ కనబరిచారని పేర్కొన్నారు.

రామగుండం కమిషనర్ రిలీవ్

- డిప్యూటీ కమిషనర్, డీఈ కూడా..

కోల్‌సిటీ: రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ నుంచి బదిలీ అయిన కీలక అధికారులు మంగళవారం రిలీవ్ అయ్యారు. ఇప్పటివరకు కమిషనర్‌గా పని చేసిన బి.సుమన్‌రావు బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌కు బదిలీ అయిన విషయం తెలిసిందే. మంగళవారం పెండింగ్‌లో ఉన్న కార్మికులు, ఉద్యోగుల వేతనాల ఫైళ్లపై ఆయన సంతకాలు చేశారు. ఇన్‌చార్జి కమిషనర్ బాధ్యతలను ఎస్ఈ చిన్నారావుకు అప్పగించినట్లు ఆయన పేర్కొన్నారు. జీహెచ్ఎంసీకి బదిలీ అయిన డిప్యూటీ కమిషనర్ నారాయణరావు, కొత్తగూడెం మున్సిపాలిటీకి బదిలీ అయిన డీఈ రవికుమార్ కూడా రిలీవ్ అయ్యారు. డీఈ రవికుమార్ స్థానంలో ప్రస్తుతం బల్దియాలో ఏఈగా పని చేస్తున్న జమీల్‌కు డీఈగా ఎఫ్ఏసీ బాధ్యతలు అప్పగించారు.





ఆకట్టుకున్న సింగరేణి కళావైభవం

గోదావరిఖని: రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో గోదావరి కళా సంఘాల సమాఖ్య సంయుక్త నిర్వహణలో సింగరేణి కళావైభవం ఉత్సవాలు ఆకట్టుకున్నాయి. గోదావరిఖని ఆర్సీవోఏ క్లబ్‌లో మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వేడుకలు కొనసాగాయి. కళాకారులను ప్రోత్సహించేందుకు ఏటా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సమాఖ్య అధ్యక్షుడు కనకం రమణయ్య తెలిపారు. శాస్త్రీయ, జానపద, పాశ్చాత్య నృత్యాలు, కోలాటం, యక్షగానం ప్రదర్శించారు. కళాకారులకు సింగరేణి కళారత్న పురస్కారాలు అందజేశారు. రామగుండం ఎమ్మెల్యే చందర్ కళాకారులకు ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో మాదరి వాసు, కె.స్వామి, దామెర శంకర్, దయానర్సింగ్, మేజిక్ రాజా, సోగాల వెంకటి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రెస్క్యూ పోటీలకు సన్నద్ధం

- యైటింక్లయిన్‌కాలనీ మెయిన్ రెస్క్యూస్టేషన్‌లో ఏర్పాట్లు
- నవంబర్ 27 నుంచి డిసెంబర్ ఒకటి వరకు నిర్వహణ
- పాల్గొననున్న 19 కోల్, 8 మెటల్ జట్లు
- మొదటిసారి పోటీలో మహిళా రెస్క్యూ టీం



మైన్స్ రెస్క్యూస్టేషన్ ముఖద్వారం



సింగరేణి రెస్క్యూ టీంలు

గోదావరిఖని: బొగ్గు గనుల్లో ప్రమాదం జరిగిన సమయంలో తామున్నామంటూ భరోసానిచ్చే సింగరేణి రెస్క్యూకు జాతీయ స్థాయిలో ప్రత్యేక పేరుంది. ఏ పోటీల్లోనైనా ప్రతిభ కనబరుస్తూ ఓవరాల్ చాంపియన్‌గా నిలుస్తోంది. ఈ క్రమంలో జాతీయస్థాయి రెస్క్యూ పోటీలను సింగరేణిలో నిర్వహించేందుకు సన్నద్ధమవుతోంది. దేశవ్యాప్తంగా 19 కోల్, 8 మెటల్ జట్లు పాల్గొననున్నాయి. ఈసారి ప్రత్యేకంగా హిందూస్థాన్ జింక్ లిమిటెడ్ నుంచి మహిళా రెస్క్యూ టీం పాల్గొననుంది. ఇందుకోసం సింగరేణి యాజమాన్యం ఇప్పటినుంచే ఏర్పాట్లు ప్రారంభించింది. ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ మెయిన్ రెస్క్యూస్టేషన్‌ను పోటీల నిర్వహణకు సిద్ధం చేస్తున్నారు. నవంబర్ 27 నుంచి డిసెంబర్ 1 వరకు పోటీలు జరగనున్నాయి. పదేళ్ల తర్వాత ప్రతిష్ఠాత్మక పోటీలకు సింగరేణి మరోమారు ఆతిథ్యం ఇవ్వనుంది. సంస్థ ప్రతిష్ఠతో ముడిపడి ఉన్న ఈ పోటీలను ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించేందుకు ఇప్పటికే డైరెక్టర్ల స్థాయిలో సమీక్షా సమావేశం జరిపారు. యాజమాన్యం సుమారు రూ.90 లక్షలు కేటాయించింది. జాతీయ స్థాయి మైన్స్ రెస్క్యూ పోటీలకు ఏటా ఒక సంస్థ జరుపుతుండగా ఈసారి సింగరేణికి అవకాశం దక్కింది.

ముందు జోనల్ స్థాయి పోటీలు

జాతీయ స్థాయి రెస్క్యూ పోటీలకు ముందే జోనల్ స్థాయి(సింగరేణి స్థాయి) రెస్క్యూ పోటీలు నిర్వహించనున్నారు. సింగరేణి వ్యాప్తంగా చురుకైన యువ ఉద్యోగులను రెస్క్యూ పోటీలకు ఎంపిక చేయనున్నారు. జోనల్ పోటీల్లో సంస్థ వ్యాప్తంగా ఆరు జట్లు పాల్గొననున్నాయి. సింగరేణి నుంచి జాతీయ పోటీల్లో రెండు టీంలు వెళ్లనున్నాయి.

ఐదు రోజులపాటు నిర్వహణ

నవంబర్ 27 నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు ఆర్జీ–2లోని మెయిన్ రెస్క్యూస్టేషన్, 7 ఎల్ఈపీ గనిలో ఐదురోజులపాటు పోటీలు నిర్వహించనున్నారు. 10 సంస్థల నుంచి సుమారు 25 జట్లు పాల్గొననున్నాయి.

హిందుస్థాన్ జింక్ లిమిటెడ్ మహిళా టీం

జాతీయ స్థాయి రెస్క్యూ పోటీల్లో మొదటిసారి హిందుస్థాన్ జింక్ లిమిటెడ్ సంస్థకు చెందిన మహిళా రెస్క్యూ టీం పాల్గొననుంది. పోటీలు ప్రధానంగా మెయిన్ రెస్క్యూ స్టేషన్‌లో నిర్వహిస్తుండగా రెస్క్యూ అండ్ రికవరీ, ఫ్రెష్ ఎయిర్‌బేస్ పోటీలను జీడీకే–7 ఎల్ఈపీ గనిలో నిర్వహిస్తారు. డ్రిల్ అండ్ పరేడ్, థియరీ టెస్ట్, ఫస్ట్ ఎయిడ్ ప్రాక్టికల్స్, స్టాటుటరీ టెస్ట్‌తోపాటు ఈసారి కొత్తగా రెస్క్యూ రిలే రేస్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

మొదటిసారి వెబ్ అప్లికేషన్స్

జాతీయ స్థాయి రెస్క్యూ పోటీల్లో పాల్గొనే జట్లు, వాటిలోని సభ్యులు వెబ్ అప్లికేషన్స్ ద్వారా దరఖాస్తు చేసుకునేలా ఏర్పాటు చేశారు. సింగరేణిలో మొదటిసారి ఈ విధానం ప్రవేశపెట్టారు. 28 జట్లు వెబ్ అప్లికేషన్స్ ద్వారా తమ జట్ల వివరాలను పొందుపర్చేలా చూస్తున్నారు.

ఏర్పాట్లు ప్రారంభించాం



అక్టోబర్‌లో జోనల్ స్థాయి, నవంబర్‌లో జాతీయ స్థాయి రెస్క్యూ పోటీల నిర్వహణకు ఏర్పాట్లు ప్రారంభించాం. జీడీకే–7 ఎల్ఈపీ గనిలో రెస్క్యూ రికవరీ, ఫ్రెష్ ఎయిర్‌బేస్ పోటీలు జరుపుతాం. అలాగే మెయిన్ రెస్క్యూ స్టేషన్‌ను మిగతా పోటీల కోసం సిద్ధం చేస్తున్నాం. పోటీల్లో పాల్గొనే జట్లు వెబ్ అప్లికేషన్ ద్వారా దరఖాస్తు చేసుకునేలా ఏర్పాట్లు చేశాం. – మాధవరావు, రెస్క్యూ సూపరింటెండెంట్

రేపు 'ఖని'లో వ్యాపార సంస్థల బంద్

గోదావరిఖని: రామగుండం కార్పొరేషన్‌లో రోడ్లు, డ్రైనేజీల తీరును నిరసిస్తూ గురువారం గోదావరిఖని బంద్ నిర్వహిస్తున్నట్లు డీసీసీ అధ్యక్షుడు ఎంఎస్.రాజ్‌ఠాకూర్ తెలిపారు. మున్సిపల్ అధికారుల తీరుతో ప్రజలు, వ్యాపారులు ఇబ్బంది పడుతున్నారని, దీనికి వాణిజ్య, వ్యాపార సంస్థలు బంద్ పాటించాలని కోరారు.

వృద్ధుడి ఆత్మహత్య

కమాన్‌పూర్: రామగిరి మండలంలోని బేగంపేటకు చెందిన గాదె లింగయ్య(69) ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. లింగయ్య కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. గొంతు నొప్పి వల్ల అన్నం తినలేకపోతున్నాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది, సోమవారం రాత్రి ఇంట్లోనే ఉరేసుకున్నాడు. మృతుడి కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవిప్రసాద్ పేర్కొన్నారు.

రమేశ్‌నగర్‌లో చోరీ

గోదావరిఖని: రమేశ్‌నగర్‌లోని పర్స శ్రీనివాస్ ఇంట్లో దొంగలు చొరబడ్డారు. బంగారం, వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లగా.. తాళం పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. బీరువాలోని తులం బంగారు చైన్, పదితులాల పట్టగొలుసులు ఎత్తుకెళ్లారని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో నార్మల్ డెలివరీ

- హైదరాబాద్ నుంచి సుల్తానాబాద్ వచ్చిన గర్భిణి
- అంతకుముందు సిజేరియన్‌కు సిఫారసు చేసిన ప్రైవేటు వైద్యులు



తల్లీబిడ్డతో డాక్టర్ రమాదేవి

సుల్తానాబాద్: ప్రైవేటు వైద్యులు నార్మల్ డెలివరీ కాదన్నారు.. సిజేరియన్‌కు సిఫారసు చేశారు.. కానీ ఆ గర్భిణి సుల్తానాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి రావడంతో గైనకాలజిస్ట్ డాక్టర్ రమాదేవి ఆమెకు నార్మల్ డెలివరీ చేశారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు. వివరాల్లోకి వెళ్తే.. హైదరాబాద్‌కు చెందిన శైలజ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. గర్భిణి అని తెలిశాక అక్కడే ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో వైద్యసేవలు పొందింది. డెలివరీ సమయానికి వైద్యులు నార్మల్ డెలివరీ కాదని.. సిజేరియన్‌కు సిఫారసు చేశారు. కానీ శైలజ తన బావ, సుల్తానాబాద్ ఆస్పత్రి వైద్యుడు మహేందర్‌కు విషయం చెప్పింది. రిపోర్ట్స్ పంపించడంతో స్థానిక గైనకాలజిస్ట్ డాక్టర్ రమాదేవికి చూపించారు. ఆమె వెంటనే ఇక్కడికి రావాలని చెప్పడంతో వచ్చింది. శైలజకు నార్మల్ డెలివరీ విజయవంతంగా పూర్తి చేశారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉండటంతో ఆ కుటుంబసభ్యులు హర్షం వ్యక్తం చేశారు. గర్భిణులకు సుల్తానాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో నాణ్యమైన వైద్య సేవలందిస్తున్నామని, సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ రమాదేవి సూచించారు.

విభజించి పాలించడమే లక్ష్యమా..?

- ఎమ్మెల్యే చందర్‌కు ఆశావహుల లేఖ

గోదావరిఖని: బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ విభజించి పాలించడమే లక్ష్యంగా పెట్టుకున్నారని కందుల సంధ్యారాణి, మిర్యాల రాజిరెడ్డి, కొంకటి లక్ష్మీనారాయణ, పాతిపెల్లి ఎల్లయ్య, బయ్యపు మనోహర్‌రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యేకు సూటి ప్రశ్నల పేరుతో మంగళవారం లేఖ విడుదల చేశారు. 2009లో టీఆర్ఎస్ టికెట్ ఇస్తే డిపాజిట్ కూడా రాలేదని, 2014లో పార్టీకి వ్యతిరేకంగా పోటీ చేసినప్పుడు కేసీఆర్, కేటీఆర్ ఎందుకుగుర్తుకు రాలేదని ప్రశ్నించారు. 2018లో సిట్టింగ్ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణపై పార్టీకి వ్యతిరేకంగా పోటీ చేసింది గుర్తులేదా..? అన్నారు. అహర్నిశలు కష్టపడి గెలిపిస్తే తమను కేటీఆర్ సభలు, ఆత్మీయ సమ్మేళనాలకు పిలవకుండా దూరంపెట్టింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఒంటెత్తుపోకడలతో పార్టీకి నష్టం చేస్తున్న ఎమ్మెల్యే తీరును బీఆర్ఎస్ కార్యకర్తలు అర్థం చేసుకోవాలని, తమతో కలిసి రావాలని కోరారు.

సింగరేణి పర్సనల్ అధికారుల బదిలీ

గోదావరిఖని: సింగరేణి వ్యాప్తంగా 11 మంది పర్సనల్ అధికారులను బదిలీ చేస్తూ యాజమాన్యం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు సీఆర్‌పీ/పీఈఆర్/సీ/26/1823 కింద మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి.

అధికారి పేరు	హోదా	ప్రస్తుతం	బదిలీ
విలాస్‌పోద్దార్	డీజీఎం	ఆర్జీ-3	కార్పొరేట్
వరప్రసాద్‌రావు	డీజీఎం	పీఎం, కార్పొరేట్	ఐఆర్ కార్పొరేట్
పి.రాజగోపాల్	పీఎం	కొత్తగూడెం	ఐఆర్ కార్పొరేట్
చేతి అశోక్	పీఎం	ఐఆర్ కార్పొరేట్	సూపర్‌బజార్, కొత్తగూడెం
గుర్రం శ్రీహరి	డీవైపీఎం	ఐకే-5 ఓసీ	పర్సనల్, ఆర్జీ-3
ఎ.సత్యబోస్	డీవైపీఎం	మందమర్రి	కార్పొరేట్
బి.గట్టుస్వామి	డీవైపీఎం	కార్పొరేట్	ఈఈ, కార్పొరేట్
కె.శ్రీనివాస్	సీనియర్ పీవో	ఏరియా ఆస్పత్రి	పీఎం, కార్పొరేట్
జి.సుధాకర్	సీనియర్ పీవో	పర్సనల్, కొత్తగూడెం	ఇల్లెందు ఏరియా
జి.సంఘమిత్ర	సీనియర్ పీవో	కేకే-1, మందమర్రి	కొత్తగూడెం ఏరియా

ప్రమాదాల్లేని సింగరేణిగా తీర్చిదిద్దాలి



మాట్లాడుతున్న సేఫ్టీ జీఎం సాంబయ్య, పక్కన అధికారులు

గోదావరిఖని: రక్షణ చర్యలను పటిష్టంగా అమలు చేసి, ప్రమాదాల్లేని సింగరేణిగా తీర్చిదిద్దాలని రామగుండం రీజియన్ సేఫ్టీ జీఎం సాంబయ్య అన్నారు. మంగళవారం జీడీకే–2,2ఏ గనిపై ఏర్పాటు చేసిన రక్షణ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రమాదాలను తగ్గించేందుకు సురక్షిత పని విధానాలు అలవంబించాలని చెప్పారు. రక్షణ పద్ధతుల అమలు, భద్రత అవగాహనపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. నా భద్రత–నా బాధ్యత, నా భద్రతే–నా కుటుంబ భద్రత అన్న నినాదాలతో సింగరేణి ముందుకెళ్తోందని, దీన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాల్సిన బాధ్యత సింగరేణీయులపై ఉందని పేర్కొన్నారు. ఏరియా ఇంజినీర్ రామ్మూర్తి, ఏఎస్‌వో బండి సత్యనారాయణ, డీవైజీఎం విజయ్‌కుమార్, రామస్వామి, గ్రూప్ ఇంజినీర్ ఓదెలు, గని మేనేజర్ తిరుపతి, సేఫ్టీ ఆఫీసర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆయన నేత్రాలు సజీవం



రాజయ్య (ఫైల్)

ఓదెల: గ్రామానికి చెందిన గొర్ల రాజయ్య (52) సోమవారం రాత్రి అనారోగ్యంతో మృతిచెందాడు. కుటుంబసభ్యులు ఆయన నేత్రాలను దానం చేయాలని నిర్ణయించుకున్నారు. మంగళవారం సదాశయ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ భీష్మాచారి ఆధ్వర్యంలో వాసన్ ఐ బ్యాంకు టెక్నీషియన్ కిరణ్ సహకారంతో నేత్రాలను సేకరించి, హైదరాబాద్ ఐ బ్యాంకుకు తరలించారు. మృతుడి భార్య రాజక్క, కుమారులు నాగరాజు, మహేందర్‌లను ఫౌండేషన్ సభ్యులు అభినందించారు.



రైలెక్కిన జేసీబీలు

గూడ్స్ రైలుపై జేసీబీలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తరలిస్తున్నారు. ఆ రైలు పెద్దపల్లి రైల్వేస్టేషన్‌లో కాసేపు ఆగడంతో ప్రయాణికులు ఆసక్తిగా గమనించారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

యువకుడి బలవన్మరణం



గణేశ్ (ఫైల్)

కోనరావుపేట(వేములవాడ): అజ్మీరాతండా (వట్టిమల్ల)కు చెందిన యువకుడు కరీంనగర్‌లో ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తుల వివరాలు.. అజ్మీరా రాంరెడ్డి–జయ దంపతుల కుమారుడు భాస్కర్ స్థానికంగా ఇంటర్ వరకు చదివి కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో పనిచేసుకుంటూ అక్కడే ఉంటున్నాడు. అతడి సోదరి హారిక కూడా మరో ఆస్పత్రిలో పనిచేస్తూ కుటుంబంతో కలిసి ఉంటుంది. మంగళవారం మధ్యాహ్నం భాస్కర్ అద్దెకు ఉంటున్న గదిలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతికి గల కారణాలు తెలియరాలేదు. ప్రేమ వ్యవహారమే కారణమని పలువురు భావిస్తున్నారు. మృతుని తండ్రి రాంరెడ్డి గల్ఫ్‌లో ఉంటున్నాడు.

కాళేశ్వరం జోన్‌లో పలువురు ఎస్సైలు..

గోదావరిఖని: కాళేశ్వరం జోన్ పరిధిలో పలువురు ఎస్సైలను బదిలీ చేస్తూ ఐజీ, రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఎస్సై పేరు	ప్రస్తుతం	బదిలీ
జగదీశ్	కమిషనరేట్	మంచిర్యాల టౌన్
విజయ్‌కుమార్	కమిషనరేట్	మహిళా,శ్రీరాంపూర్
రాకేశ్	కమిషనరేట్	సీసీఎస్, మంచిర్యాల
ప్రసాద్	కమిషనరేట్	సీఎస్‌బీ, రామగుండం
రామయ్య	కమిషనరేట్	లక్సెట్టిపేట, ఎస్సై-2
సర్కార్	కమిషనరేట్	ఎస్ఐ–2, జన్నారం
సిరాజ్‌అహ్మద్	కమిషనరేట్	సీసీఎస్,మంచిర్యాల
అబ్దుల్‌సత్తార్	కమిషనరేట్	వీఆర్, రామగుండం
వెంకటేశ్వర్‌రావు	లక్సెట్టిపేట	చెన్నూర్
రమణ	మందమర్రి	సీఎస్‌బీ, మంచిర్యాల
కళాధర్‌రెడ్డి	టూటౌన్, జీడీకే	సీసీఎస్, మంచిర్యాల
సహదేవ్‌సింగ్	కమాన్‌పూర్	వీఆర్,రామగుండం
సురేందర్	ట్రాఫిక్	సీఎస్‌బీ, మంచిర్యాల
తానాజీ	జన్నారం	వీఆర్,రామగుండం
రాములు	బెల్లంపల్లి	వీఆర్, రామగుండం
శ్రీనివాస్	సీసీఎస్, మంచిర్యాల	వీఆర్, రామగుండం
సుగుణాకర్	వీఆర్, రామగుండం	జీడీకే–1 టౌన్
రాజేందర్	మహిళా, శ్రీరాంపూర్	మంచిర్యాలటౌన్
వినోద్‌కుమార్	చెన్నూర్	పీసీఆర్, మందమర్రి
మధుసూదన్	సీసీఎస్	జీడీకే–2టౌన్
ఎ.వెంకటేశ్వర్	టాస్క్‌ఫోర్స్	ఎస్‌హెచ్‌వో, ములుగు

సీఐల బదిలీ

సీఐ పేరు	ప్రస్తుతం	బదిలీ
కె.ప్రవీణ్‌కుమార్	రామగుండం, ట్రాఫిక్	మహిళా, శ్రీరాంపూర్
టి.ప్రవీణ్‌కుమార్	మహిళా, శ్రీరాంపూర్	రామగుండం ట్రాఫిక్
కోట బాబురావు	సీసీఆర్‌బీ	గార్లబయ్యారం
ఆర్.కృష్ణ	టాస్క్‌ఫోర్స్	లక్సెట్టిపేట
వై.కృష్ణారెడ్డి	లక్సెట్టిపేట	సిద్దిపేట–1